# విశాలాంధ్ర కృష్ణా జిల్లా

## అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో కేడీసీసీబీ : తాతనేని

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : రైతులకు మాత్రమే కాకుండా అన్ని వర్గాల ప్రజలకు కేడీసీసీ బ్యాంక్ అందుబాటులో ఉంటుందని చైర్ పర్సన్ తాతినేని పద్మావతి అన్నారు. ఆదివారం బ్యాంకు కాన్ఫరెన్స్ హాల్ నందు విలేకరులతో జరిపిన ఇష్టాగోష్టి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు కేడీసీసీ బ్యాంకు రైతుల కొరకు మాత్రమే పనిచేస్తుందన్న అపోహ ఉండేదని, దానిని తొలగించి అన్ని వర్గాల ప్రజలకు రుణాలు అందిస్తు, బ్యాంకింగ్ వ్యవస్థలో భారతదేశంలో ఐదో స్థానంలోనూ, రాష్ట్రంలో మొదటి స్థానంలోనూ కృష్ణా జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉందన్నారు. ఆనాడు అయ్య దేవర కాళేశ్వరరావు రైతులకు సహాయం చేసే ఉద్దేశంతో వారిని అందరిని కలుపుకుని ఏర్పాటుచేసిన సహకార బ్యాంకు నేడు 10980 కోట్ల రుణాలను ఇచ్చే స్థాయికి ఎదిగింది అన్నారు. కృష్ణాజిల్లాలో 57 బ్రాంచీలు, 425 సొసైటీలతో ముందుకు సాగుతూ కేంద్రమంత్రి అమిత్ షా చేతుల మీదుగా అవార్డు అందుకోవటం గర్వకారణం అన్నారు. స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆనాడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 900 కోట్ల రూపాయలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా 100 కోట్లు కలిపి సొసైటీలు జిల్లా బ్యాంక్ మరియు ఆప్కాబ్ లతో మూడంచల విధానం ఏర్పాటు చేయడం ద్వారా బ్యాంకును బలవపత్రం చేశారన్నారు. నేటి ముఖ్యమంత్రి యంత్రాలకు, వ్యవసాయ అనుబంధ రుణాలు, ఉపాధి హామీ మరియు చేయూత ద్వారా అన్ని వర్గాలకు న్యాయం చేయడమే కాకుండా ఏ పంటలో నష్టపోతే అదే పంట కాలంలో నష్టపరిహారం అందించడం కౌలు రైతులకు కూడా లబ్ధి చేకూరేలా బ్యాంకుకు సంబంధించి 170 బిల్డింగ్స్ కన్స్ట్రక్షన్ చేయడం జరిగిందన్నారు. చనిపోయిన ఉద్యోగస్తులకు 20 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ కూడా ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈవో రామ్ మనోహర్, డైరెక్టర్లు వెంకన్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతే టీడీపీ లక్ష్యం : కొనకళ్ల

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : మహిళలకు పెద్దపీట వేస్తున్నది తెలుగుదేశం మాత్రమేనని మహిళ అభ్యున్నతే పార్టీ లక్ష్యం అని మాజీ ఎంపీ కొనకళ్ళ నారాయణరావు అన్నారు ఆదివారం తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అధ్యక్షతన జరిగిన మహిళా సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న నారాయణరావు మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కు కల్పించిన స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయ సాధనతో, ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే మహిళలకు ఉచితంగా మూడు ఫ్రీ గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం వంటి పథకాలతో మహిళల అభ్యున్నతికి పాటుపడతామని చెప్పటం గర్వకారణం అన్నారు. తలసిల స్వర్ణలత మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మద్యపానం నిషేధం చేస్తానని నమ్మించి మహిళల ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత కల్తీ బ్రాండ్లతో మహిళల తాళిబొట్లు తెంచుతున్న దని, తెలుగు మహిళలు వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, మహిళలకు జరుగుతున్న అన్యాయాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికలలో తెలుగుదేశం విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ఫోటోగ్రాఫర్ సాయికి ఫోటోగ్రఫీలో జాతీయ స్థాయి గోల్డ్ మెడల్

విశాలాంధ్ర-గన్నవరం : ఉత్తరప్రదేశ్‌లోని హోలీ ఉత్సవాలలో తీసిన ఒకే ఒక్క ఫోటోకు గన్నవరం మండలం దావాజి గూడెం గ్రామానికి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ డి.జి.ఎం.ఎస్. సాయి కుమార్‌కు రెండు జాతీయ స్థాయిలలో ప్రథమ బహుమతులు వచ్చాయి. ఫోటోగ్రాఫర్ డి.జి.ఎం.ఎస్. సాయికుమార్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం మణికర్ణిక ఆర్ట్ గేలరీ సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి ఫోటోగ్రఫీ పోటీలో జాతీయ స్థాయి గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను పొందాడు. ఈ సందర్భంగా సాయి శనివారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నం జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయంలో కలెక్టర్ రాజబాబు చేతుల మీదుగా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. కలెక్టర్ రాజబాబు, సాయి తీసిన ఫోటో ఆల్బమ్, ప్రొఫైల్ ఫోటో ఫైల్‌ను నిశితంగా పరిశీలించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయస్థాయి ఉత్తమ అవార్డులను, పతకాలను పొందాలని సాయికి ఆశీస్సులు తెలిపారు. విజయవాడలో ప్రసిద్ధి చెందిన ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ దసరా ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన ఫోటోగ్రఫీ పోటీలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఫోటోగ్రాఫర్ అవార్డు పొందిన తెప్పోత్సవం ఫోటోను కలెక్టర్‌కు సాయి బహుమతిగా అందించాడు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు చందమామ బాబు, ఏపీయూడబ్ల్యూజే సభ్యత్వ నమోదు కమిటీ జిల్లా కన్వీనర్ సి.హెచ్.రమేష్ బాబు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు ధనియాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మొవ్వలో ప్రవాస భారతీయులు బాబురావు వర్ధంతి

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ గ్రామానికి పలు రకాలుగా ఆర్థికంగా చేయూత నివ్వటమే కాకుండా ఎంతోమంది ఈ ప్రాంత యువతీ యువకులకు తను స్థాపించిన సాఫ్ట్వేర్ సంస్థ ద్వారా జీవనోపాధి కల్పించి వారి జీవితాలలో వెలుగు నింపిన మహోన్నత వ్యక్తి మండవబాబురావు అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన జన్మస్థలమైనకృష్ణాజిల్లాలోని మొవ్వలో గ్రామపంచాయతీ కార్యాలయ సమీపంలో నిర్మించిన బాబురావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. గ్రామ పెద్ద తాతినేని పూర్ణచంద్రరావు పూలమాలలు వేచి నివాళులు అర్పించిన ఈకార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మండవ రామ మోహన రావు, వార్డు సభ్యులు ఈడే నాగ బాబు, వేములపల్లి సుధాకర్,సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వర రావు, గ్రామస్థులు మండవ కోటేశ్వర రావు, మండవ పిచ్చేశ్వర రావు, సంకుల గోపి, గురిందపల్లి భాస్కర రావు, యార్లగడ్డ నరసింహారావు, మండవ వీరభద్రరావు, మండవ సుబ్బారావు తదితరులు పాల్గొని ప్రవాస భారతీయులు బాబూరావుకు నివాళులర్పించారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు నిలువుటద్దం

విశాలాంధ్ర-బంటుమిల్లి :- సంస్కృతి, సంప్రదాయాలకు కొమ్మారెడ్డి టాలెంట్ హైస్కూల్ విద్యార్థులు నిలువుటద్దంగా నిలుస్తారు .2024 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు పాఠశాలావరణలో 2024 అక్షరమాలతో ప్రదర్శనగా కూర్చొని పలువురిని అబ్బురపరిచారు. మతాలకతీతంగా విద్యార్థులు ఆయా పండుగలకు సంబంధించిన వేషధారణలతో ప్రతి పండుగ విశేషాలను, విశిష్టతని వివరిస్తు కన్నులకు కట్టినట్లుగా ప్రదర్శనలు చేస్తు పలువురిని కనువిందుచేస్తూ వుంటారు. చదువుతో పాటు సమాజంలోని సంస్కృతి, సాంప్రదాయాలను తెలుసుకుని వాటిని కాపాడుకోవలసిన బాధ్యత విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలనే తపనతో విద్యార్థులు ముందుకు దూసుకుపోతూ ఉంటారు .అనంతరం పాఠశాలవిద్యార్థులు పాత్రికేయులకు ,పాత్రికేయ సంస్థల యాజమాన్యానికి ,పలువురికి నూతన సంవత్సర శుభాకంక్షాలు తెలిపారు.

### స్వామినాథన్ కమిషన్ సిఫార్సు అమలు చేసి

# రైతులను ఆదుకోవాలి

**రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడి ఎలమందరావు**

విశాలాంధ్ర-చల్లపల్లి : స్వామినాథన్ కమిషన్ సిఫార్సును అమలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మల్నీడు ఎలమందరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కృష్ణా జిల్లా కార్యవర్గం ఆదివారం స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎలమందరావు మాట్లాడుతూ రైతాంగ సమస్యలను పరిష్కరి స్తామని రైతులను లక్షాధికారులను చేస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలేదని విమర్శించారు. రైతాంగం చాలా ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి దేశంలో కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులకు రైతుల గురించి ఆలోచించే పరిస్థితి లేదని, అందరికీ అన్నం పెట్టే రైతు అనాథగా మిగిలాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతన్నలు పంటలు పండించి పేదలకు అన్నం పెడితే ప్రభుత్వాల నుండి రైతులకు ఏమి మేలు జరిగిందని ప్రశ్నించారు. దేశంలో రైతులకు రక్షణ లేకుండా పోయిందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. దేశంలోని అన్ని రకాల వ్యవసాయ పంటలకు రుణమాఫీ చేయాలని కోరారు. వ్యవసాయ పంటల రుణాలను మాఫీ చేయాలని, తద్వారా వ్యవసాయ రంగ సంక్షోభాన్ని రైతులు ఆత్మహత్యలను నివారించేందుకు అవకాశం ఉంటుందని అనేక రైతు సంఘాలు ప్రభుత్వాల వద్ద విన్న విస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలకు ప్రభుత్వం స్పందించడం లేదని విమ ర్శించారు. రైతులకు సేవ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ అదానీ, అంబానీల సేవలో తరిస్తున్నాడని విమర్శించారు. దేశంలో సంవత్సర కాలానికి పైగా సాగిన చారిత్రాత్మక రైతు పోరాటం ఫలితంగా నరేంద్ర మోడీ ప్రభుత్వం దిగివచ్చి మూడు రైతు వ్యతిరేక నల్లచట్టాలను పార్లమెంటు సాక్షిగా ఉపసంహరించు కొని యావత్ రైతు జాతికి కన్నీటితో క్షమాపణలు చెప్పడం రైతుల ఐకమత్య ఉద్యమానికి ఫలితం అన్నారు. దేశంలో అనేక ప్రభుత్వాలు రైతుసమస్యల పరిష్కారం కోసం 65 కమీషన్లు వేసి ఆ కమీషన్ రిపోర్టులను అమలుచేయకుండా బుట్ట దాఖలు చేశాయన్నారు. కమీషన్ సిఫార్సులు అమలుచేస్తే రైతులకు పోరాడాల్సిన అవసరం రాదన్నారు.బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలుచేస్తామనీ, ఒక్క రైతు ఆత్మహత్య చేసుకోవటానికి వీల్లేదని ఎన్నికల సమయంలో మోదీ నమ్మబలికార న్నారు. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రైతాంగా సమస్యలు పరిష్కరించు కునేందుకు రైతులంతా పార్టీలకతీతంగా సంఘటితం కావాలని పిలుపుని చ్చారు. రాబోయే ఎన్నికల్లో రైతు వ్యతిరేక బిజెపి పార్టీని, దానికి మద్దతుగా ఉన్న పార్టీలను గద్దె దింపేందుకు జనవరి ఒకటో తేదీన విజయవాడ లోని సిద్ధార్థ ఆడిటోరియంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 18 వ మహాసభలు జనవరి 8, 9,10 తారీకులలో రాజమండ్రిలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహాసభలలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చర్చ జరిపి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని కోరారు ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి తుమ్మ చిన్న కొండయ్య, కాట్రగడ్డ రామచంద్ర జోషి, కోదాటి నారాయణరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు, సీపీఐ నాయకులు నక్కా శ్రీనివాసరావు అట్లూరి వెంకటేశ్వరరావు, కొర్రపాటి ముఖర్జీ, మేకా నరసింహారావు, బండి రామ కృష్ణలు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక 25వ వార్డులోని పెదఎరుకపాడులో పలు అభివృద్ధి కార్యక్రమలో భాగంగా కమ్యూనిటీ హాల్‌ను, అడపా వెంకటరమణ(బాబ్జీ) పేరుతో అయన జ్ఞాపకర్థం మున్సిపల్ పార్కును ఎంపి వల్లభనేని బాలశౌరి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)లు ఆదివారం శంకుస్థాపన, ప్రారభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ రంగ ఆర్ఇసి సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ నిధులు కోటి రూపాయలతో గుడివాడ పట్టణం 25వ వార్డు పెదఎరుకపాడులోని మున్సిపల్ స్థలంలో నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌కి మాజీ మున్సిపల్ చైర్మన్ అడపా బాబ్జి పేరును పెట్టాలని స్థానికులు కోరడంతో ఆయన పేరును పెట్టేల కృషి చేస్తామన్నారు. అనతరం అడపా బాబ్జీ పేరు మీద ఉన్న మున్సిపల్ పార్కును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, వైసిపి నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి, దుక్కిపాటి శశిభూషణ్, రేమల్లి నీలాకాంత్, అడపా జగదీష్, తోట శివాజీ, అడబాల అప్పారావు, మున్సిపల్ అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

## భవిష్యత్తుకు ఊపిరి : పేర్ని నాని

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : గతాన్ని సమీక్షించుకుంటూ, వర్తమానాన్ని విశ్లేషించుకుంటూ, భవిష్యత్తును అన్వయించుకోవాలని మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని అన్నారు. మచిలీపట్నం ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జీవితాన్ని గుణాత్మకంగా తీర్చిదిద్దుకోవడం ద్వారానే నూతనత్వం సంతరిస్తుందని, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని నిర్దిష్ట లక్ష్యాలను రూపొందించుకొని యువత ముందుకు సాగాలన్నారు. జీవితం పట్ల సరైన దృక్పథం, సంకల్ప బలం ఉంటేనే లక్ష్యసాధనలో సఫలీకృతులు అవుతారని, నూతన సంవత్సరం ఆంధ్రప్రదేశ్ తో పాటు దేశ ప్రజల జీవితాల్లో అన్ని రంగాల్లో గుణాత్మక ప్రగతికి బాటలు వేస్తూ ముందుకు సాగాలని, సరికొత్త ఆశలు, లక్ష్యాలతో ప్రజలు మరింత సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు కోవిడ్ జే ఎన్ వేరియంటుకు తగిన జాగ్రత్తలు పాటించి వేడుకలు జరుపుకోవాలని సూచించారు.

## కొనసాగుతున్న అంగన్వాడీలు ఆందోళనలు

విశాలాంధ్ర-బంటుమిల్లి :- అక్కచెల్లెమ్మలంటావు - రోడ్డుమీద పడేస్తున్నావ్ నీకు న్యాయమా జగనన్న అంటు అంగన్వాడీలు ,హెల్పర్లు రోడ్డుపై కూర్చొని నిరసన తెలిపారు. సీఎం జగన్ మోహనరెడ్డి పాదయాత్రలో అంగన్వాడీ లకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని చేస్తున్న సమ్మె ఆదివారం నాటికి 20 వ రోజుకు చేరుకుంది .ఇన్ని రోజులు గడుస్తున్నా నేటికి తమ సమస్యలను పట్టించుకోకుండ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటం దారుణమని అంగన్వాడి కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నామన్నారు .ముఖ్యమంత్రి ,మంత్రులు ,ఎం ఎల్ ఏ లు నిర్వహించే ప్రతి సమావేశాల్లో మహిళల లను నా అక్కలు ,నా చెల్లెళ్లు ,నా తల్లులు అని సంబోధిస్తూ మహిళల అభివృద్ధే మా ధ్యేయమని చెబుతున్నా మీకు అంగన్వాడీలు మహిళలు కాదా ? అంగన్వాడీలలో అక్కలు ,చెల్లెళ్లు ,తల్లులు కనబడటం లేదా అని ప్రశ్నించరు .మీరు ఇస్తానన్నా వాటినే మేము అడుగుతున్నాము గాని ,కొత్తగా ఏమి ఇమ్మనడం లేదన్నారు .ఇదేనా మహిళలపై మీకున్న అభిమానం, మహిళలని చుడకుండా రోడ్డుపాలు చేయడమేనా మీ ప్రధాన లక్ష్యం అని ప్రశ్నించారు. పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలంలోని అంగన్వాడి కార్యకర్తలు ,హెల్పర్లు పాల్గోన్నారు.

## అంగన్వాడి సిబ్బంది ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి : 2023వ సంవత్సరానికి వీడ్కోలు పలికే చివరి రోజైన ఆదివారం కూడా మాకు ఈ పరిస్థితి ఏమిటంటూ అంగన్వాడీ సిబ్బంది ఆటపాటలతో నిరసన తెలియజేశారు. మహిళలందరూ ఇండ్ల వద్ద నూతనసంవత్సరమైన 2024ను స్వాగతం పలుకుతూ రంగవల్లులు వేసుకునే ఈ సమయంలో కూడా అంగన్వాడి సిబ్బంది నిరసన దీక్షలో పాల్గొని తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్పందించి చర్చలు నిర్వహించి తమ డిమాండ్ల అమలుపై దృష్టి సారించాలని వారంతా కోరారు...

## 4న మినీ జాబ్ మేళా

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : జనవరి 4వ తేదీన జరుగు మినీ జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కృష్ణాజిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు అన్నారు. ఆదివారం పత్రిక ప్రకటన విడుదల చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ మరియు జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 4వ తేదీన ఉదయం 10 గంటలకు మచిలీపట్నం బైపాస్ రోడ్ లో గల కృష్ణవేణి ఐటిఐ నందు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు అన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సిపాన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ మినీ జాబ్ మేళాలో జియో టెలికాం కంపెనీలో గల వివిధ ఉద్యోగాలకు సంబంధించి ఇంటర్వ్యూ నిర్వహిస్తామని, ఈ ఉద్యోగాలకు ఇంటర్, ఐటిఐ, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన యువకులు తమ బయోడేటా సర్టిఫికెట్స్ జిరాక్స్ మరియు ఆధార్ కార్డు కాపీలతో హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 12 వేల నుండి 17500 వరకు వేతనం ఉంటుందని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగపరచుకోవాలని కోరారు.

## జాతీయ స్థాయిలో రాణించి దివిసీమ ఖ్యాతిని ఇనుమడింపచేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : థైక్వాండో లో జాతీయ స్థాయిలో రాణించి దివిసీమ ఖ్యాతిని దేశ నలుమూలలా వ్యాపింప చేయాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం మండలి తన కార్యాలయంలో థైక్వాండో పోటీలలో స్వర్ణ పథకాలను సాధించిన విద్యార్థులను సత్కరించి మాట్లాడారు. డిసెంబర్ నెల 29,30 తేదిలలో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి థైక్వాండో పోటీలలో చల్లపల్లి పవన్ థైక్వాండో కోచింగ్ సెంటర్ విద్యార్థులు మార్గాని తనయ్ బాలాజీ, హరిగళ్ళ కార్తికేయ, హేమరాజు లు పతకాలు సాధించగా వారిని అభినందించి కోచ్ పవన్‌ను దుసాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ నెల 19,20,21 తేదిలలో రాజస్థాన్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు అర్హత సాధించగా జాతియ స్థాయిలో కూడా రాణించి దివిసీమ ఖ్యాతిని దేశ నలుమూలలా విస్తరింపచేయాలని మండలి కోరారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సాంప్రదాయ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులను పరిశీలించిన జిల్లా నేతలు

విశాలాంధ్ర-కూచిపూడి : కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణలో కొనసాగుతున్నఏకలా అభియాన్ ద్వారా విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల స్థితిగతులను ఆదివారం వి.హెచ్.పి మహిళా జిల్లా నేత పోలన సుష్మ ఆయా గ్రామస్తులతో కలిసి పరిశీలించి నివేదికలు రూపొందించుకున్నారు. ఆమె కూచిపూడి, నిడుమోలు, యద్దనపూడి, అవురుపూడి గ్రామాలలో గల ఐదు కేంద్రాలలో సాంప్రదాయ సాంస్కృతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల స్థితిగతులను స్వయంగా పరిశీలించారు. ఆమె ఆయా కేంద్రాలలోని పిల్లలలో గల క్రమశిక్షణను, నాయకత్వ లక్షణాలను, పిల్లల ఎదుగుదలను, విద్యపై గల శ్రద్ధ, ఆటపాటల ద్వారా పెంపొందింపజేసే సాంస్కృతి సంప్రదాయాలను తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు ఆమె సంబంధితఇనస్ట్రక్టర్స్., గ్రామస్తులతో, కలిసి పరిశీలించారు. ఈ కేంద్రాలను పామర్రు, మువ్వ, పమిడిపక్కల మండలాలలో 30 కేంద్రాలలో నిర్వహించడానికి అనుమతులు లభించాయని వివరించారు.

## విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

విశాలాంధ్ర-పమిడిముక్కల: కృష్ణాపురం శివారు కొత్త దళితవాడ లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యలమర్రు హెచ్ఎం ఆర్.వరుణ్ కుమార్ నోటు పుస్తకాలు వ్రాసుకోనే అట్టలు పంపిణీ చేశారు.ఆదివారం సదరు పాఠశాల లోని 25 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు ప్యాడ్స్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక తో మెలగాలని ఉన్నత విద్య అభ్యసించాలని తల్లిదండ్రులు కు మంచి పేరు తేవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కొండవీటి బాబు కొండవీటి యోబు కాటూరి ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ లారా హక్కుల సాధనకు పోరాడండి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ముదిరాజులను చైతన్యపరిచి రాజకీయ హక్కుల కోసం పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రచార చైతన్య రథం ప్రారంబించి కళా జాతాలు నిర్వహిస్తుంది. ఈ నెల 22వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రారంభమైన ప్రచార చైతన్య రథం ప్రకాశం గుంటూరు జిల్లాలు మీదుగా ఆదివారం విజయవాడ చేరుకుంది. ముదిరాజ్ మహసభ రాష్ట్ర అధ్యక్షులు వర్ల నారాయణ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి వలిబోయిన రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో చైతన్య రథం మధురానగర్ లో కొనసాగింది. ప్రజా కళాకారుడు బుల్లెట్ వెంకన్న ముదిరాజ్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రజాగేయాలతో చైతన్య పరిచారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో ముదిరాజులను రాజకీయంగా చైతన్యపరుస్తామని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నారాయణ ముదిరాజ్ తెలిపారు. 20 లక్షలు పైగా ఉన్న ముదిరాజులను రాజకీయ పార్టీలు గుర్తించడం లేదని అందుకే పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. ముదిరాజులను బీసీ డీ, నుండి బీసీ ఏకు మార్చాలని ప్రభుత్వాన్ని కోరామన్నారు. రాష్ట్రంలో ఉన్న ముదిరాజ్‌లందరూ ఐక్యంగా హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వలిబోయిన రాజు ముదిరాజ్, జిల్లా అధ్యక్షుడు దుప్పల శివాజీ, ఉపాధ్యక్షుడు చింతకాయల శివాగణేష్, కోలా ఏడుకొండలు, తోకల రవి, బుస్సా రామకృష్ణ, శంకర్, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సిడి బండ్ల సందడి

విశాలాంధ్ర-పెడన: పెడన గ్రామ దేవత పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం అంబరాన్నాట్టింది. మహిమాన్వితురాలైన పైడమ్మ తల్లిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఉత్సవ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కొత్తపేటలోని అమ్మవారి ఆలయానికి వెళ్లే దారులన్నీ కిటకిటలాడాయి. పెక్కు సంఖ్యలో సిడిబండ్లను అంగరంగ వైభవంగా ఊరేగించాయి. డప్పు వాయిద్యాలు, మేళ తాళాలు, వీరంగ విన్యాసాలు, హుషారైన పాటలతో, సందడి సందడిగా సాగిన సిడి బండ్ల ఊరేగింపులు చూపారులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని అంచనా వేసిన ఆలయ ఏవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన రావు, దాసు.వాయునందన రావులు ఆలయం వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు క్యూ లైన్ లను పర్యవేక్షించారు. పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు ఆలయ ఈవో, వ్యవస్థాపక ధర్మకర్త వాయు నందన రావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. కాగా సంబరాలు ఆదివారం ఆరవ రోజుకు చేరుకున్నాయి.

## చంద్రబాబును గెలిపించుకుందాం : కుమార్‌రాజా

విశాలాంధ్ర-కూచిపూడి : అధికారంలోకి వచ్చే ఐదేళ్ళు నిండుతున్నప్పటికి రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని చెప్పుకోలే దుస్థితిలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఉన్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా ధ్వజమెత్తారు. మొవ్వ మండలం అయ్యంకిగ్రామంలో నిర్వహించిన"బాబుష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ". కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మినీ మేనిఫెస్టోలోని పథకాలను గురించి వివరిస్తూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే చేయబోయే అభివృద్ధిని సంక్షేమాన్ని ఇంటింటికి తిరుగుతూ వివరించే కరపత్రాలను ప్రజలకుఅందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు లింగమనేని రామలింగేశ్వర రావు, వీరంకి తులసీదాసు, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నన్నపనేని వీరేంద్ర, రాష్ట్ర తెలుగు యువత నాయకులు పానుగంటి సందీప్, నాయకులు రాజులపాటి మస్తాన్, రాజుల పాటి వెంకటేశ్వరరావు, పామర్తి నాగయ్య, వెంకటేశ్వరరావు, వీర్ల నరేష్, జేజి బాబు, కాకాని సుధారాణి, చలసాని దివ్య, జవ్వనపూడిసరోజిని, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు వెనిగండ్ల ఆర్థికసాయం

విశాలాంధ్ర-గుడివాడ : ఇటీవల కార్మికులు చేస్తున్న నిరసన దీక్షలకు మద్దతు తెలిపిని సమయంలో కరోనా వల్ల 3గురు పారుశుధ్య కార్మికులు మరణించారని వారిని అదుకోవాలని కార్మికులు విన్నపనికి స్పందించి ఒకోక్క కుటుంబానికి రూ 5వేల చోపున్న అందజేసి మనవతవాన్ని చాటుకున్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సమాపనికి సమాన వేతనం ఇవ్వాలని నిరసన దీక్షలు చేస్తున్న శిభిరం వద్ద టిడిపి ఇన్‌చార్జి వెనిగండ్ల రాము తన పార్టీ, మిత్రపక్ష పార్టీ అయిన జనసేన నాయకులతో కలసి రూ1లక్ష 50వేలు రూపాయిల నగదును అందజేశారు. జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, పట్టణ,రూరల్ టిడిపి అధ్యక్షులు దింట్యాల రాంబాబు, వాసే మురళి, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకవరపు సునీల్, నాయకులు పంద్రాజు సాంబయ్య, పాల్గొన్నారు.

## ఇండియాన్ లాయర్స్ అసోసియేషన్ 2024 క్యాలండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుడివాడ : ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ 2024 క్యాలెండర్‌ను న్యాయమూర్తి మద్రాస్ హైకోర్టు జడ్జి జస్టిస్ బట్టు దేవానంద్ ఆవిష్కరించారు. ఆదివారం కృష్ణాజిల్లా గుడివాడ పట్టణంలోని న్యాయమూర్తి బట్టు దేవానంద్ స్వగృహము అయన చేతుల మీదగా నూతన క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ బట్టు దేవానంద్ మాట్లాడుతూ న్యాయవాదులు తమ వృత్తితోపాటు భవిష్యత్ తరాలకు ఉపయోగపడే అంశాలపై, ఉదాహరణకు విద్యా వైద్యం తదితర రంగాల్లో ఉద్యోగాలు జీవనోపాధి కల్పించే అంశాలతో కూడుకున్న అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు జి.శాంతకుమార్,హైకోర్టు న్యాయవాదులు ఐఎల్ఏ రాష్ట్ర సభ్యులు గుంటి సురేష్‌బాబు, ఎన్‌టిఆర్ జిల్లా ఐఎల్ఏ అధ్యక్షులు డేవిడ్ రాజు, అసోసియేషన్ సభ్యులు అనుమల బ్రహ్మేశ్వరరావు, కంచర్ల కోటేశ్వరరావు, జాల సంజీవ్, మాణిక్యరావు, రవికుమార్, మచిలీపట్నం మైలవరం, ఉయ్యూరు, తదితరులు పాల్గొన్నారు.

## నిడుమోలులో పాఠశాలను పరిశీలించిన వీహెచ్‌పీ నేతలు.

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం నిడుమోలు గ్రామంలో వి.హెచ్.పి. పర్యవేక్షణలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కొనసాగే ఏకలాఅభియాన్.పాఠశాలలోని పిల్లల స్థితిగతులను పలువురు నేతలు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి పోలనసుష్మ పిల్లలలోని క్రమశిక్షణను, ఎదుగుదలను, విద్య పై గల శ్రద్ధ, ఆటపాటల ద్వారా సాంస్కృతి సంప్రదాయాలను పెంపొందించడం తదితర అంశాలను పరిశీలించారు. ఈమెతోపాటు ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షులు డాక్టర్.పోలనఅశోక్ కుమార్, గ్రామస్తులు కూడా పాల్గొన్నారు

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

# కొనసాగుతున్న మున్సిపల్ వర్కర్స్ సమ్మె

**విశాలాంధ్ర-జగ్గయ్యపేట:** మున్సిపల్ ఉద్యోగులు, కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్ కొరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ మరియు ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటీయు) ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరవధిక సమ్మె ఆదివారం 6వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ లోని పాత మున్సిపల్ కార్యాలయం గేటు ముందు కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ మున్సిపల్ కాంటాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యూటీ, పెన్షన్ ఇవ్వాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, డ్రైవర్లకు 18,500 ఇవ్వాలని, మున్సిపల్ ఆప్కాస్ ఉద్యోగులు, కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యూటీ సగం జీతం, పెన్షన్ ఇవ్వాలని, సిబ్బందికి సిపిఎస్ రద్దు చేసి, ఓ పి ఎస్ ను అమలు చేయాలని, విలీన పంచాయతీలలో కరోనా, వరదలు, విపత్తుల సందర్భంగా కొత్తగా తీసుకున్న కార్మికులకు జీతాలు, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# కమిషనరేట్‌కు వస్తే కదలరిక!

- పదేళ్లకు పైగా విజయవాడలోనే పాతుకుపోయిన సీఐలు
- ఎస్‌ఐ నుంచి సీఐలు, ఏసీపీలు, ఏడీసీపీలుగా పదోన్నతి పొందినా కదలని వైనం
- వీఆర్‌లో అయినా ఇక్కడే ఉంటారు.. - కనీసం కమిషనరేట్ పరిధి కూడా దాటరు
- తప్పనిసరి అయినప్పుడు అలా జిల్లాకు వెళ్లి ఇలా వచ్చేస్తారు
- కొత్తగా ఎవరికీ ఇక్కడికి వచ్చే చాన్స్ ఇవ్వరు

**విశాలాంధ్ర-విజయవాడ క్రైం:** ఎస్‌ఐగా విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చి సీఐలుగా పదోన్నతి పొందినవారు కొందరు... సీఐలుగా వచ్చి ఇక్కడే స్థిరపడినవారు మరికొందరు... ఎస్‌ఐ నుంచి సీఐ, ఏసీపీ, ఏడీసీపీ వరకు కూడా విజయవాడలోనే పాతుకుపోయినవారు ఇంకొందరు... ఇలా ఒక్కసారి విజయవాడ పోలీస్ కమిషనరేట్‌కు వచ్చిన అధికారులు తర్వాత మళ్లీ రూరల్‌కు గానీ, రేంజ్ పరిధిలోని మరో జిల్లాకు గానీ వెళ్లడం లేదు. అవసరమైతే వీఆర్‌లో అయినా ఇక్కడే ఉంటున్నారు. కొత్తగా ఎవరూ విజయవాడ వచ్చే అవకాశం ఇవ్వడంలేదు. మూడు, నాలుగేళ్లుగా కేవలం ఇద్దరు సీఐలు మాత్రమే బయట జిల్లా నుంచి విజయవాడకు రావడమే ఇందుకు నిదర్శనం.

## 10 నుంచి 30 ఏళ్లుగా....

ప్రస్తుతం నగరంలో పని చేస్తున్నవారిలో ఒక ఏసీపీ దాదాపు 30ఏళ్లకు పైగా ఇక్కడే ఉన్నారు. ఆయన 1991 బ్యాచ్‌లో ఎస్‌ఐగా ఎంపికైన తర్వాత తొలి పోస్టింగ్ విజయవాడలోనే ఇచ్చారు. అక్కడి నుంచి సీఐగా, ఏసీపీగా పదోన్నతులు పొందినా విజయవాడలోనే విధులు నిర్వర్తిస్తున్నారు. మధ్యలో ఒకటి, రెండుసార్లు ఏలూరు జిల్లాకు బదిలీ అయినా రాజకీయ పలుకుబడితో వాటిని నిలిపివేసుకుని ఇక్కడే కొనసాగుతున్నారు. మరో ఏడీసీపీ స్థాయి అధికారి కూడా ఇదే తరహాలో విజయవాడలోనే పాతుకుపోయారు. ఇక ప్రస్తుతం సీఐలుగా ఉన్నవారిలో దాదాపు 75శాతం మంది 2004, 2007, 2009 ఐఎస్ బ్యాచ్‌లకు చెందినవారు ఉన్నారు. వీరంతా విజయవాడ కమిషనరేట్‌కు ఎస్‌ఐలుగా వచ్చి క్రమంగా సీఐలుగా పదోన్నతులు పొంది ఇక్కడే పనిచేస్తున్నారు. మిగిలిన 25శాతం మంది కూడా దాదాపు సీఐలుగా పదేళ్ల కిందట విజయవాడ వచ్చి ఇక్కడే సెటిల్ అయ్యారు.

## పక్కా ప్లాన్‌తోనే...

పోలీసు నిబంధనల ప్రకారం ఒక స్టేషన్‌లో ఎస్‌ఐ, సీఐలు మూడేళ్లు మాత్రమే విధులు నిర్వర్తించాల్సి ఉంది. స్థానిక పరిస్థితులను బట్టి దాదాపు మూడేళ్లు ఎవరూ ఒకే స్టేషన్‌లో పనిచేసే పరిస్థితి ఉండదు. అందువల్ల ఎక్కువ మంది వీలైనంత త్వరగా ఇతర ప్రాంతాలకు బదిలీ అయ్యే అవకాశం ఉంటుంది. కానీ విజయవాడకు ఒక్కసారి వచ్చినవారు ఇక ఇక్కడే పాతుకు పోయేలా పక్కా ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. మొదట లా అండ్ ఆర్డర్‌లో పనిచేసేందుకు ప్రయత్నిస్తారు. సాధ్యం కాకపోతే ట్రాఫిక్, ఎస్‌బీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఈబీ, సీఎంఎస్ సహా పలు విభాగాల్లో పని చేస్తూ ఇక్కడే ఉంటారు. వీటిలో కూడా ఎక్కడా ఖాళీ లేకపోతే పోలీస్ కమిషనర్ కార్యాలయంలోనే వివిధ సీట్లలో సెట్ అయ్యేలా చూసుకుంటారు. చివరికి వీఆర్‌లో అయినా ఇక్కడే ఉంటారు. కానీ బయటకు మాత్రం వెళ్లడం లేదు. ఒకవేళ తప్పనిసరి అయితే కృష్ణా జిల్లాకు అలా వెళ్లి ఇలా వచ్చేస్తున్నారు. ప్రస్తుతం అది కూడా లేదు. మరోవైపు లా అండ్ ఆర్డర్‌లో పని చేస్తున్న సమయంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులతో సఖ్యతగా మెలుగుతూ మంచి పోస్టింగ్‌ల కోసం ప్రయత్నిస్తుంటారు. ఏ పార్టీ అండలేని వారిని మాత్రమే బయట జిల్లాకు పంపుతారని కమిషనరేట్‌లో ప్రచారం జరుగుతోంది.

## కొత్తవారికి అవకాశం కష్టమే...

ప్రస్తుతం విజయవాడలో ఉన్న సీఐలలో ఎక్కువ మంది 2004 నుంచి 2009 మధ్య సర్వీసులో చేరినవారే. వీరు ఇప్పుడే కదిలే పరిస్థితి కనిపించడం లేదు. అందువల్ల ఇతర ప్రాంతాల నుంచి విజయవాడకు రావాలనుకునేవారికి అవకాశం ఉండదు. తాము ఎంత ప్రయత్నించినా విజయవాడకు బదిలీ చేయడం లేదని ఇటీవల దుర్గగుడిలో దసరా ఉత్సవాలకు బందోబస్తు కోసం వచ్చిన పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఓ సీఐ ఆవేదన వ్యక్తంచేశారు.

# సంఘటిత శక్తితో హక్కుల సాధిద్దాం

**చలసాని వెంకట రామారావు**

**విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్:** సంఘటిత శక్తి ద్వారానే పాలకుల నుంచి హక్కుల సాధన సాధ్యమని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు చలసాని వెంకట రామారావు అన్నారు. విస్సన్నపేటలో ఆదివారం జరిగిన సంఘం మండల మహాసభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు ప్రజలు, కార్మికుల హక్కులను కాలరాస్తూ, సంక్షేమం పేరుతో బిచ్చమేసి పబ్బం గడుపుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయిల్, బీమా చెల్లింపుల్లో కొద్దిపాటి రాయితీ ఇస్తే, వాహన కార్మికులకు లక్షల రూపాయలు ఆదాయం సమకూరే అవకాశం ఉండగా, రోజురోజుకూ వాటిని పెంచుకుంటూ, ఏడాదికి రూ.10వేలు ఇచ్చి సంక్షేమం అంటూ ఊదరగొడుతున్నారన్నారు. పాఠ శాల ఆయాలు, వంట ఏజంట్లకు గౌరవవేతనం పేరుతో చాలీచాలని వేతనాలు చెల్లిస్తూ, జీవనస్థితిని దిగజార్చుతున్నారన్నారు. వారికి కనీసం పనిభద్రత సైతం కరవయ్యిందని వ్యాఖ్యానించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీ అమలుకు అంగన్‌వాడీ కార్యకర్తలు రోజుల తరబడి ఆందోళన చేయాల్సి రావటం దురదృష్టకర మన్నారు. నూజివీడులో ఒక అంగన్‌వాడీ కార్యకర్త రోడ్డుప్రమాదానికి గురైతే, ఎటువంటి సాయం అందించలేదన్నారు. ఏఐటీయూసీ చేసిన పోరాటంతో అధికారులు దిగివచ్చి ఆర్థికసాయం అందించటం సంఘం విజయమని పేర్కొన్నారు. ఇదే విధానం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా రాష్ట్రప్రభుత్వం ఆదేశాల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. పాలకుల మెడలు వంచే శక్తి కార్మికశక్తికి మాత్రమే ఉందన్న విషయం ఎన్నో సంఘటనలతో రుజువయ్యిందని తెలిపారు. మండల నాయకుడు ఎం.త్యాగ రాజు అధ్యక్షతన జరిగిన సభలో రాష్ట్ర కమిటీ సభ్యుడు చాట్ల పుల్లారావు, రైతుసంఘం జిల్లా నాయకులు తూము కృష్ణయ్య, వ్యకాసం జిల్లా కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు, వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎస్‌కె.సుభాని, నాయకులు ఉదయ్, ఎస్‌కె.నాగుల్‌మీరా, నాగుల్‌మీరా(కార్పెంటర్), నాంచారయ్య, శ్రీనివాసరావు, అంజమ్మ, ధనలక్ష్మి, జయలక్ష్మి, లక్ష్మి, దానయ్య, వెంకటేశ్వరరావు, పలు సంఘాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

# వైవీరెడ్డి జీవితం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న అందరికీ ఆదర్శప్రాయం

**విజయవాడ-విశాలాంధ్ర(చిట్టినగర్):** నాగార్జునసాగర్ ఏపీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్గీయ వైవి రెడ్డిగారి వ్యక్తిగత జీవితం, వృత్తిగత జీవితం రెండూ ఉపాధ్యాయవృత్తిలో ఉన్నవారందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. 34వ పుస్తక మహోత్సవం నాలుగో రోజు ఆదివారం కేతు విశ్వనాథ రెడ్డి సాహిత్యవేదిక నాగార్జున సాగర్ ఏపీ రెసిడెన్షియల్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్గీయ వైవి రెడ్డి స్మృతి సంచిక 'నిలువెత్తు పాఠం' పుస్తకాన్ని ఐఏయస్ అధికారి మహ్మద్ ఇంతియాజ్ ఆవిష్కరించారు. ఈ పుస్తకానికి సంపాదకత్వం వహించిన పాత్రికేయులు వైవీరెడ్డిగారి శిష్యుడు జూలూరు గౌరీశంకర్ మాట్లాడారు. లయోలా కళాశాల అధ్యాపకులు మొవ్వా శ్రీనివాసరెడ్డి, కుటుంబసభ్యులు బ్రిగేడియర్ వెంకటరెడ్డి తదితరులు మాట్లాడారు. వైవిరెడ్డి భార్య శేషమాంబ సభలో పాల్గొన్నారు.

## 22 మంది నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత

- ఆహారం కలుషితం కావడంతో సమస్య

**విశాలాంధ్ర-విజయవాడ (క్రైం):** మథర్ దెరిస్సా నర్సింగ్ హాస్టల్ లోని 22 మంది నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థ గురైయ్యారు. ఈఘటన ఆదివారం విజయవాడ సూర్యారావు పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దుర్గాపురంలోని మథర్ థెరిస్సా నర్సింగ్ హాస్టల్‌లోని కేరళకు చెందిన 22 మంది కలుషితమైన ఆహారం తిని విద్యార్థినులు అస్వస్థకు గురైయ్యారు. వాంతులు, విరోచనలు కావడంతో వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ కొంత మంది హాస్టల్‌కు తిరిగి వచ్చారు. మరికొంత మందికి కూడా ఇదే తరహా లక్షణాలు ఉండటంతో చికిత్స పొందుతున్నారు.

## యువకుడిపై కత్తితో దాడి

**విశాలాంధ్ర-విజయవాడ (క్రైం):** యువకుడి పై కత్తితో దాడి జరిగింది. ఈ ఘటన ఆదివారం వైఎస్సాఆర్ కాలనీలో చోటుచేసుకుంది. భవానీపురంకు చెందిన నాగేంద్ర తన కారులో స్నేహితులతో కలిసి పూజా కార్యక్రమాలు ఉండటంతో వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో అదే ప్రాంతానికి చెందిన ఆటో సాగర్ ఆటోతో కారుకు అడ్డం పెట్టాడు. ఇద్దరికి గోడవ జరిగింది. చిన్న కత్తితో నగేంద్ర పై దాడి చేశారు. తీవ్రగాయాలైన నగేంద్రను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేస్తూ దర్యాప్తు చేస్తున్నారు.

# అర్ధరాత్రి భారీ వృక్షాల నరికివేత

- వృక్షాలు నరికివేతను అడ్డుకున్న గ్రామస్తులు
- అర్ధరాత్రి చెట్ల నరికివేతపై పలు అనుమానాలు
- ఆటల పేరుతో విద్యార్థులకు నీడ లేకుండా చేస్తారా?

**విశాలాంధ్ర-వత్సవాయి:** మండల కేంద్రమైన వత్సవాయిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ మైదానంలో దశాబ్దాల కాలంగా నీడను ఇచ్చే వేప వృక్షాలను గుట్టు చప్పుడు కాకుండా శనివారం అర్ధరాత్రి నరికి వేశారు.. విషయం తెలుసుకున్న స్థానికులు మహా వృక్షాలను తొలగించకుండా అడ్డుకున్నారు అప్పటికే నాలుగు వృక్షాలను ముక్కలు ముక్కలుగా చేసి వేశారు అర్ధరాత్రి సమయంలో వృక్షాలను ఎందుకు తొలగిస్తున్నారని కార్మికులను ప్రశ్నించగా తమకేమీ తెలియదని పైవారు చెబితే తొలగిస్తున్నామని సమాధానం ఇచ్చారు ... ఏది ఏమైనప్పటికీ దశాబ్దాల కాలం పాటు ఉన్నటువంటి మహా వృక్షాలను ఆటల పేరుతో తొలగించడం సబబు కాదని పలువురు ఆరోపిస్తున్నారు క్రీడా మైదానంలో ఆడుకునే వారికి ఎంతో మైదానం ఉన్నప్పటికీ ఈ వృక్షాలు ఉన్న స్థలమే అడ్డుగా ఉన్నదా? ప్రభుత్వాలు మొక్కలు పెంచండి పర్యావరణాన్ని పరిరక్షించండి అని ఒక వైపు చెబుతుంటే మరోవైపు నిలువ నీడను ఇచ్చే మహా వృక్షాలను సైతం స్వలాభం కోసం మహా వృక్షాలను నరికి వేస్తున్నారు... మార్చి మరియు ఏప్రిల్ నెలలో దశాబ్దాల కాలం పాటు ఆ చెట్ల క్రిందనే చదువుకునే విద్యార్థిని విద్యార్థులు వారి పరిస్థితి ఏమిటి నాలుగు రోజులు నిర్వహించుకునే క్రీడల కోసం ఎన్నో సంవత్సరాలుగా విద్యార్థిని విద్యార్థులకు నీడను ఇచ్చే చెట్లను నరికి వేయడం ఎంతవరకు సమంజసం అని పలువురు వారి వారి వాదనలను వినిపిస్తున్నారు ఏది ఏమైనప్పటికీ వేసవికాలంలో విద్యార్థినీ విద్యార్థులకు నిలువ నీడను లేకుండా చేసిన ఘనత ప్రస్తుతం ఉన్న ప్రధానోపాధ్యాయులు మరియు విద్యా కమిటీకి మాత్రమే దక్కిందని పలువురు విమర్శిస్తున్నారు.... దీనిపై ప్రధానోపాధ్యాయులు అశోక్ కుమార్ ని వివరణ అడగగా ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం కోసం చెట్లను తొలగించడం జరిగిందని అన్నారు.

## హద్దు మీరి ప్రవర్తిస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు

**విశాలాంధ్ర-జగ్గయ్యపేట :** నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ప్రజలు హద్దు మీరి ప్రవర్తిస్తే ఎంతటి వారికైనా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ ఆనంద్ కుమార్ హెచ్చరించారు.జగ్గయ్యపేట పట్టణ పరిధిలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏసిపి జనార్ధన్ నాయుడు ఆదేశాల మేరకు సీఐ జానకి రామ్ ఆధ్వర్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అర్ధరాత్రి ఆరుబయట వేడుకలకు అనుమతులు లేవన్నారు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ మరియు సెక్షన్ 144 సిఆర్పిసి అమలులో ఉన్నందున బహిరంగ ప్రదేశాలలో ఐదుగురు అంతకన్నా ఎక్కువ వ్యక్తులు గుమ్మిగూడటం నిషేధమని తెలిపారు.

# నూతన సంవత్సర శుభాకాంక్షలు

-2024లో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

-సీపీఐ రాష్ట్ర కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

**విశాలాంధ్ర-విజయవాడ :** సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రజలకు 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక దాసరి భవన్‌లో ఆదివారం కేక్‌కట్ చేశారు. కొత్త సంవత్సరంలో రాష్ట్రం కరువు, తుపాన్‌ల వంటి విపత్తులు రాకుండా ప్రజలందరూ సుభిక్షంగా, సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీ సత్యనారాయణమూర్తి, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, గుజ్జుల ఈశ్వరయ్య, అక్కినేని వనజ, డి.జగదీశ్, జంగాల అజయ్‌కుమార్, దేగా ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు ఆర్.రవీంద్రనాథ్, సీహెచ్.కోటేశ్వరరావు, ఎ.మారుతీ వరప్రసాద్, పెన్మెత్స దుర్గాభవాని, దోనేపూడి శంకర్, నక్కి లెనిన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**విశాలాంధ్రలో...** విశాలాంధ్ర దినపత్రిక ఎడిటోరియల్ బోర్డులో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనగా జరిగాయి. ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కూన అజయ్‌బాబు కేక్‌కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యూస్ ఎడిటర్ మోదుమూడి మురళీకృష్ణ సంపాదక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

# పాఠకులకు ఉత్తేజాన్నిస్తున్న పుస్తక మహోత్సవం

**విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్):** 34వ విజయవాడ పుస్తక ప్రదర్శన డిసెంబర్ 27 నుంచి 2024 జనవరి 7వ తేది వరకు సాయంత్రం 5 నుండి రాత్రి 8.30 గంటల వరకు, శని, ఆదివారాలు, సెలవు రోజుల్లో మధ్యాహ్నం 12.30 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పది రోజులు కొనసాగే ఈ పుస్తక ప్రదర్శన ప్రారంభ సభకు ప్రభుత్వ కేంద్ర సాహిత్య రథసారథులు మాధవ్ కౌశిక్, కృత్తివెంటి శ్రీనివాసరావు, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్, ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ ఎం డి ఇంతియాజ్ పాల్గొని సందేశాలని ఇచ్చారు. గత రెండు రోజులుగా కొనసాగుతున్న పుస్తక ప్రదర్శన పాఠకులను, పుస్తక ప్రియులను, రచయితలను ఆకర్షిస్తుంది. కేతు విశ్వనాథరెడ్డి కళావేదికపై ప్రముఖులు రచించిన పుస్తకాలను ఆవిష్కరించేందుకు ముఖ్య అతిథులుగా యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, విశాలాంధ్ర విజ్ఞాన సమితి సభ్యులు, కె నారాయణ, చైర్మన్ కే రామకృష్ణ, గవర్నరింగ్ బాడీ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, కార్యదర్శి జెల్లీ విల్సన్, దినపత్రిక కార్యదర్శి పి హరినాథ్ రెడ్డి, సహాయ కార్యదర్శి గడ్డం కోటేశ్వరరావు లు పాల్గొని సందేశాలనిచ్చారు. ఆదివారం సాయంత్రం జరిగిన పుస్తక ప్రదర్శనలో పురస్కార గ్రహీతలు, రాజకీయ, అభ్యుదయ ఉద్దండులు, ప్రముఖ రచయితలు పాల్గొని విశాలాంధ్ర విజ్ఞాన సమితి, ఇతరులు ఏర్పాటుచేసిన స్టాల్స్ బాల సాహిత్యం ఆధ్యాత్మికం, వ్యక్తిత్వ వికాసం, వైద్యం, ఆరోగ్యం వంటి అన్ని రంగాలకు చెందిన పుస్తకాలతో పాటు, చరిత్ర, సాహిత్యం, ప్రముఖుల జీవిత చరిత్ర గ్రంథాలు అందుబాటులో ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ, పాఠశాల విద్యాశాఖ స్టాల్స్ ను తిలకించి పుస్తకాలను విక్రయించారు. పలు స్టాల్స్, వేదిక వద్ద సందడి నెలకొంది. సువిశాలమైన మైదానంలో పాఠకులకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా 180 స్టాళ్లతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసారు. బుక్ ఫెస్టివల్ అధ్యక్ష కార్యదర్శులు టీ మనోహర్ నాయుడు కే లక్ష్మయ్యలు నిర్వాహకులుగా ఉన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో తెలుగుకు సంబంధించి విశాలాంధ్ర, నవ చేతన, ఎమెస్కో, భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు వ తెలుగు అకాడమీ, తదితర ప్రచురణ సంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ పుస్తక ప్రదర్శనలో తెలుగు, ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషల్లో సుమారు రెండున్నర లక్షలకుపైగా వివిధ రకాల పుస్తకాలు తగ్గింపు ధరతో అందుబాటులో ఉంచారు.

## అంగన్వాడీలకు విప్ సతీమణి సంఘీభావం

**విశాలాంధ్ర-జగ్గయ్యపేట :** తమ డిమాండ్ల కోసం జగ్గయ్యపేట పట్టణం, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్వాడి వర్కర్ల ను ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను సతీమణి విమలభాను కలిశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి అని అధికారంలోకి రాగానే అంగన్వాడి వర్కర్లకు జీతాలు పెంచారని గుర్తు చేశారు. అంగన్వాడీ వర్కర్ల డిమాండ్లను సామినేని ఉదయభాను ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. అనంతరం అంగన్వాడి వర్కర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## సౌత్ జోన్ టెన్నిస్ టోర్నీ ఛాంపియన్ ఎస్ఆర్ఎం

**విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ :** కృష్ణా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర లయోల కళాశాలలోని టెన్నిస్ అకాడమీలో జరుగుతున్న దక్షిణ మండల అంతర విశ్వ విద్యాలయాల టెన్నిస్ పురుషుల ఛాంపియన్ గా ఎస్.ఆర్.ఎమ్ విశ్వవిద్యాలయం నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో ఆంధ్ర విశ్వవిద్యాలయంపై 3-0 తేడాతో విజయం సాధించి ఛాంపియన్షిప్ ను కైవసం చేసుకుంది. రన్నరప్ గా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలవగా మూడు, నాలుగు స్థానాల్లో భారతీయార్ విశ్వవిద్యాలయం, కె.ఎల్.డీమ్డ్ విశ్వవిద్యాల యం జట్లు నిలిచాయి. నాలుగు జట్లు అఖిల భారత అంతర విశ్వవిద్యాలయాల టెన్నిస్ పురుషుల టోర్నమెంట్ కు అర్హత సాధించాయి. అనంతరం జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృష్ణా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.జ్ఞానమణి పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా జ్ఞానమణి మాట్లాడుతూ టోర్నీ నిర్వహణకు అనుబంధ కళాశాలల సిబ్బంది సహకారం పూర్తిస్థాయిలో అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.వీర బ్రహ్మచారి, కృష్ణా వర్శిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నవీన్ లావణ్య లత, ఆంధ్ర లయోల కళాశాల ప్రిన్సిపాల్ ఫాథర్ జి.ఏ.పి.కిషోర్, టోర్నీ కన్వీనర్ డా.జె.వి.నాగేంద్రప్రసాద్, వైస్సార్ హెల్త్ వర్శిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డా.ఇ.త్రిమూర్తి, అకాడమిక్ ఆఫీసర్ డా.ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# వీధివిక్రయదారులకు ప్రభుత్వం చట్టంలో ఉన్న 18 సౌకర్యాలు, హక్కులను కల్పించాలి

**విశాలాంధ్ర-విజయవాడ :** వీధివిక్రయదారులకు ప్రభుత్వం చట్టంలో ఉన్న 18 సౌకర్యాలు, హక్కులను కల్పించాలని ఏపీ వీధివిక్రయధారుల కార్మిక ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్రప్రధాన కార్యదర్శి తెడ్డు వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక దాసరి భవనం వద్ద ఆదివారం సెంట్రల్ నియోజకవర్గంలోని వీధి విక్రయదారులలో భాగంలో ఉన్న చిరు వ్యాపారస్తులు, చేతివృత్తిదారుల వారికి ప్రభుత్వ గుర్తింపు కార్డులు కొరకు దరఖాస్తులు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధివిక్రయదారుల చట్టంలో ఉన్న అధికారులు 39వ సెక్షన్ ప్రకారం వీధివిక్రయదారులు 18 సౌకర్యాలు హక్కులతో కూడుకున్న ఫోటో గుర్తింపు కార్డులు, కుటుంబంతో కూడుకున్న వెండింగ్ సర్టిఫికెట్లు, ఆర్థిక వ్యాపార భద్రతతో కూడుకున్న ధృవపత్రాన్ని నగర్ మున్సిపల్ కమిషనర్ ఇవ్వాల్సి ఉందన్నారు. అందుకోసం ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయగా వందకు పైబడి వీధివిక్రయదారులు పేర్లు నమోదు చేసుకు న్నారని తెలిపారు. ఏఐటీయూసీ నగర సమితి ప్రధాన కార్యదర్శి మూలి సాంబ శివరావు ఆధ్వర్యంలో నగరంలో ఈ పేర్ల నమోదు కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక వీధివిక్రయధాలు లావేటి అప్పలనాయుడు. గోపి చెట్టి దుర్గాశంకర్.కే దుర్గ ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతమ్మ సన్నిధిలో డీఆర్ఓ

**విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు :** తిరుపతమ్మ అమ్మవారి దర్శనం చేసుకోను టకు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. వి.నాగేశ్వరరావు. ఆలయానికి రాగ ఆలయ కార్యనిర్వహణాధికారి మరియు డిప్యూటీ కలెక్టర్ కె రమేష్ నాయుడు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారికి వేద ఆశీర్వచనం మరియు తీర్థ ప్రసాదములు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె. లక్ష్మి కళ్యాణి.మరియు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. తదుపరి శ్రీ అమ్మవారి ఆలయం లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆలయ ఏఈ రాజు, కాంట్రాక్టర్లతో కలిసి కార్యనిర్వహణాధికారి తో కలిసి పరిశీలించారు.ఆలయం నందు జరుగుచున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి అని సంబంధిత కాంట్రాక్ట్ వారికి తెలిపారు.

## ఎకో స్పేస్‌లో నూతన సంవత్సర వేడుకలు

**విశాలాంధ్ర-విజయవాడ :** నగరంలోని పటమట ఎకో స్పేస్ ఆవరణలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అరవై నివాసాలు గల ఈ సముదాయంలో నూతన సంవత్సర ఆగమనాన్ని పురస్కరించుకుని విభిన్న కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నా పెద్దా అంతా కలిసి వేడుకలలో పాలుపంచుకున్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు అదరహో అనిపించాయి. స్వాగత గీతం మొదలు సాంప్రదాయ, ఆధునిక నృత్యాల మేలు కలయికగా సాగిన వారి అభినయం అందరినీ అబ్బుర పరిచింది. శిక్షకుల సహాయం లేకుండానే అందుబాటులో ఉన్న సాధన సంపత్తి ద్వారా చిన్నారులు ఎవరికి వారు నృత్యాలను నేర్చుకుని, అద్భుత ప్రదర్శనలను ఇవ్వటం ద్వారా హైబ్రీడ్ యుగానికి సంకేతాలుగా నిలిచారు. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ఎకో స్పేస్ బృందం సభ్యులు కేక్ కట్ చేసారు. పెద్దల కోసం నిర్వహించిన తంబోలా, మ్యూజికల్ ఛైర్స్ వంటివి వారిలో నూతన ఉత్తేజాన్ని తీసుకువచ్చాయి. కార్యక్రమంలో ఎకో స్పేస్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకరరావు, కొడాలి శ్రీధర్ (చిన్ని), సుంకర భరత్, కామినేని రాణి, లక్ష్మి నారాయణ, అన్నపురెడ్డి కవిత తదితరులు పాల్గొన్నారు.

## షిరిడి సాయి 2024 క్యాలెండర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ :** షిరిడి సాయి మందిరం(ముత్యాలంపాడు)లో షిరిడి సాయి 2024 క్యాలెండర్ ను మందిరం కమిటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ పి గౌతమ్ రెడ్డి శనివారం ఉదయం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంధ్ర షిరిడిగా పేరు గడించిన ముత్యాలంపాడు షిరిడి సాయి మందిరం అనేక ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ బాబా వారి కృపను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భక్తులు పొందేట్లు చేస్తుందని అన్నారు. క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మందిర కమిటీ అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ఇంచార్జ్ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్య శ్రీహరి, సభ్యులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు చేపట్టాలి: ఏఐఎస్ఎఫ్

**విశాలాంధ్ర-విజయవాడ :** కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఏఐఎస్ఎఫ్ విజయవాడ సమితి ఆధ్వర్యంలో విజయవాడలో ఉన్న కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలో ఆదివారం సెలవు దినం అయినప్పటికీ తరగతులు నిర్వహిస్తుంటే ఏఐఎస్ఎఫ్ నాయకత్వం వెళ్లి అడ్డుకొని వాళ్లని ఇంటికి పంపించడం జరిగింది . ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి మందగల సాయికుమార్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలు మరియు కళాశాలకు ప్రభుత్వ నిబంధనలు వర్తించవా ? అని నిలదీశారు. విద్యాశాఖ అధికారులు అంటే అసలు లెక్క లేకుండా పోతుందన్నారు. విద్యార్థులను మానసిక ఒత్తిళ్లకు గురి చేస్తున్న విజయవాడలో ఉన్న ఇలాంటి అనేక కార్పొరేట్ విద్య సంస్థలు శ్రీ చైతన్య , నారాయణ , ఏస్సార్ జూనియర్ కాలేజ్ , ఎన్ఆర్ఐ కళాశాలలో సెలవు దినాల్లో తరగతలతో పాటు పరీక్షలు నిర్వహిస్తున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకత్వానికి విద్యార్థులు తెలియపరచగా వెంటనే స్పందించి పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి అడ్డుకొని వాళ్లను ఇంతకు పంపించడం జరిగింది . అంతేకాకుండా జిల్లా విద్యాశాఖ అధికారికి ఫోన్ చేసి తెలియపరచిన వెంటనే స్పందించి కళాశాలలకు వద్దకు రావడం జరిగింది . వెంటనే స్పందించి వచ్చినందుకు ఆర్ఐఓ కి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష కార్యదర్శులు రంజిత్ జగదీష్ నగర నాయకులు సురేష్ కే సాయికుమార్ అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.